క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్ నుమా ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ కందికల్‌గేట్ సబ్‌స్టేషన్ అన్ని ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

ఛత్రినాక ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వర్మను సన్మానిస్తున్న సభ్యులు

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన కె.ఎస్.ప్రసాద్ వర్మను శాంతి కమిటీ సభ్యులు సన్మానించారు. కమిటీ సభ్యులు కాశమోని శ్యాంరావు ముదిరాజ్, ముత్యం యాదవ్, సి.ధర్మేందర్ రావు, చిన్న, రాజు, గణేష్, శ్రావణి ఆదివారం స్టేషన్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అన్ని వర్గాల ప్రజల పండుగలు వైభవంగా జరిగే ఈ స్టేషన్ పరిధిలో శాంతియుత వాతావరణం కోసం కృషి చేయాలని కోరారు.

వాకర్స్ సమస్యలపై సుదీర్ఘ చర్చ



సమావేశానికి హాజరైన వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

నాంపల్లి: తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు–2024 ముగిశాయి. ఇన్నాళ్లు అసెంబ్లీ కొనసాగింపు కారణంగా పబ్లిక్‌గార్డెన్స్‌లోని వాకర్స్‌ను అనుమతించలేదు. ప్రస్తుతం సమావేశాలు ముగియడంతో పబ్లిక్‌గార్డెన్‌లోనికి ప్రజలు తిరిగి వెళ్తున్నారు. దీంతో ఆదివారం ఉదయం పబ్లిక్ గార్డెన్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ గులాం యాజ్దాని సమావేశం అయ్యారు. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే వాకర్స్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది.

సమాజ సేవతో గుర్తింపు



నియామకపత్రాలు అందజేస్తున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: సమాజ సేవతో సంఘంలో గుర్తింపు వస్తుందని హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ తెలంగాణ పీస్ అంబాసిడర్ మహ్మద్ నజీబ్ అన్నారు. హ్యూమన్ రైట్స్ కమిటీ సభ్యులుగా నియమితులైన జహంగీర్ పహిల్వాన్, సజ్జులకు ఆదివారం ఆయన టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని కార్యాలయంలో నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు పేద వర్గాల వారికి సేవలు అందించడమే తమ ప్రధాన ఆశయమని దీని కోసం తాము 15 ఏళ్లుగా పని చేస్తున్నామని అన్నారు. సంస్థలో పని చేస్తున్న సభ్యులంతా నిస్వార్థంగా పని చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. మరో వైపు ఎందరో నాయకత్వ లక్షణాలను కూడా నేర్చుకున్నారని తాము పని చేసే వివిధ రంగాల్లో వారు విశేషంగా రాణిస్తున్నారన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలి



క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్ ముప్పాల వేణు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలని మ్యాచ్‌పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ ముప్పాల వేణు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీల్లో అండర్–15 డబుల్స్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన లక్ష్య సంహిత, దిలీప్ టీమ్‌ను ఆదివారం పలువురు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం వారికి తగిన ప్రోత్సాహం కల్పించేలా క్రీడలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 27న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు జొన్నాడ శశి, సిద్ధారెడ్డి, యశ్వంత్, తరుణ్ పాల్గొన్నారు.

ఖురాన్ పఠన పోటీలు



గోల్కొండ: ఖురాన్ పఠనంతో మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా ఆధ్యాత్మిక భావాలు మెరుగవుతాయని గోల్కొండ మదర్సా రహమత్ ఉల్ ఉల్లూమ్ వ్యవస్థాపకుడు కారీ మతీన్ అలీషా అన్నారు. ఆదివారం గోల్కొండ రిసాలబజార్‌లోని మదర్సాలో విద్యార్థులకు ఖురాన్ గ్రంథ పఠనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉత్తమ పఠనం చేసిన విద్యార్థులను ప్రశంసించారు.

స్వామియే శరణం అయ్యప్ప



విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ హుడాకాలనీ రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం హరిహరపుత్ర అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. అయ్యప్పమాలధారుల శరణుఘోషతో ఆసిఫ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. సాయిబాబ గురుస్వామి ఆధ్వర్యంలో పండితులు సుప్రామని వాయిద్యాలు నేత్రపర్వంగా నిర్వహించారు. సన్నిధానం గురుస్వాములు కవిడిదేవి రాంచందర్, నందు, స్వామి, నర్సింగ్‌రావు, డబ్ల్యూ రాజు, గోపాల్, హరికాంత్, హోమదేవ్, సంఘ సేవకులు ముక్కళ్ల నాగేశ్వర్‌తో పాటు ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రిస్మస్ వేడుకలు



జియాగూడ: జియాగూడ కేశవస్వామినగర్‌లోని క్రైస్ట్ నిస్సీ చర్చిలో ఈనెల 23వ తేదీ నుంచి క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నట్లు చర్చి పాస్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివా రం ఆయన మాట్లాడుతూ.... జియాగూడలో మూడు ప్రధాన చర్చిలు కొనసాగుతున్నాయని క్రైస్ట్ నిస్సీ చర్చితో పాటు ఇందిరానగర్ కానాన్ ప్రేయర్ హౌస్, జియాగూడ అంబేడ్కర్ లైఫ్ చర్చిలు కొనసాగుతున్నాయని అన్నారు. అందులో 300లకు పైగా క్రైస్తవ కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. చర్చిల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. అలాగే వేడుకలకు ప్రతి చర్చికు నిధులు మంజూరు చేయాలని కోరారు.

గణితానికి ఉన్న ప్రాధాన్యం ఎంతో విస్తృతమైంది

జీఎన్ఐటీఎస్‌లో మెథమ్యాటిక్స్ డే



గోల్కొండ: షేక్‌పేట్‌లోని జీ.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఇంటర్నేషనల్ మెథమ్యాటిక్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూహెచ్ గణిత శాస్త్ర విభాగం ప్రొ. అండ్ హెడ్ డాక్టర్ ఎం.ఎస్.రాజశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత శాస్త్రానికి ఉన్న ప్రాధాన్యం ఎంతో విస్తృతమైందని అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో సైన్స్‌కు తోడుగా గణిత శాస్త్రం కూడా ఉందన్నారు. కొద్దిగా గణితంపై ఆసక్తి పెంచుకుంటే ఇది సులువుగా అర్థం అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల వారు జాతీయ గణిత క్విజ్‌ను నిర్వహించారు. దీనిలో 95 జట్లు పాల్గొన్నాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి తెలిపారు. గెలుపొందిన వారికి ఎంఎస్ రాజశేఖర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.మాధవిలత, డాక్టర్ అపర్ణ, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గణితశాస్త్ర ప్రదర్శన



జియాగూడ: గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ సేవలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచాయని శ్లోకా ది స్కూల్ ప్రిన్సిపల్, డైరెక్టర్ నాగేశ్వర్ అన్నారు. రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జియాగూడ శాంతినగర్ శ్లోకా ది స్కూల్‌లో ఏర్పాటు చేసిన 350 గణిత శాస్త్ర నమూనాల చార్టులు, మోడల్స్ రూపంలో చేసిన ప్రదర్శనలు ఆదివారంతో ముగిశాయి. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ రతన్ ప్రకాష్ జైస్వాల్, తిరుమల్‌రావు, బి.అజీష్, వైస్ ప్రిన్సిపల్ అమితా ఛరణ్ పాల్గొన్నారు.

ఫిరోజ్ ఖాన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలి



కాషాయి రంగు షూను ధరించిన మహ్మద్ ఫిరోజ్ ఖాన్

నాంపల్లి: కాంగ్రెస్ నేత మహ్మద్ ఫిరోజ్ ఖాన్ కాషాయ రంగు షూ ధరించి గో మహా పాదయాత్రలో గురువు గోపాలకృష్ణను కలవడాన్ని ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాంతి కిరణ్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫిరోజ్ ఖాన్ హిందూ ధర్మాన్ని అవమానపరిచి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని వాపోయారు. కాబట్టి హిందువులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కాషాయ రంగు కలిగిన షూతో గో మహా పాదయాత్రకు వెళ్లి అపవిత్రం చేశారని మండిపడ్డారు.

హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సంఘం నాయకులు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడ గిరిజన కాలేజీ విద్యార్థుల వసతిగృహంలో నెలకొన్న సమస్యలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధర్మానాయక్ అన్నారు. బండ్లగూడలోని వసతి గృహాన్ని ఆదివారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో సందర్శించి విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. 240 మంది విద్యార్థులున్న ఈ హాస్టల్‌లో కేవలం 14 గదులే ఉన్నాయని, పూర్తిస్థాయిలో బెడ్లు లేక విద్యార్థులు నేలపై పడుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. లైబ్రరీ, పేపర్, టీవీ సదుపాయం కూడా లేదన్నారు. అపరిశుభ్రత కారణంగా విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాంకుమార్, నాయకులు సత్తార్, శ్రీకాంత్, బాలకోటి, కృష్ణ, గణేష్, పవన్ పాల్గొన్నారు.

టీబీ నివారణకు ప్రత్యేక వ్యాక్సినేషన్ సర్వే



మురళీధర్

యాకుత్‌పురా: ప్రభుత్వ ఆదేశాల మేరకు టీబీ నివారణ చర్యల్లో భాగంగా వ్యాక్సినేషన్ కోసం ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నామని డబీర్‌పురా క్లస్టర్ ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ ఎన్. మురళీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీబీ నిర్మూలనకు ప్రభుత్వం 18–60 ఏళ్ల లోపు వారికి బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. క్లస్టర్ పరిధిలోని డబీర్‌పురా, అజాంపురా, దారుషిఫా, యాకుత్‌పురా–1,2 యూపీహెచ్‌సీ కేంద్రాల పరిధిలో వ్యాక్సిన్ సర్వే చేపట్టామన్నారు. ఇంటింటికి నిర్వహించే ఈ సర్వే ప్రక్రియ ఈ నెల 31 వరకు కొనసాగుతుందన్నారు. సర్వేతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ కేంద్రాలల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు అవసరమైన చికిత్సలు అందిస్తున్నారన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

చార్మినార్: వారాల కాపు సామాజిక వర్గానికి చెందిన వారందరు అన్ని రంగాల్లో ఆశించిన ఫలితాలు సాధించేలా తమ సంఘం కృషి చేస్తోందని రాష్ట్ర వారాల సంఘం అధ్యక్షులు గాజుల చంద్రశేఖర్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్యా, ఉద్యోగ రంగాల్లో వారాల కాపు సామాజిక వర్గాల వారు తమ ప్రత్యేకతను చాటుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్య సలహాదారులు గాజుల కృష్ణ, ప్రధాన కార్యదర్శి గాజుల రాజులు, వెంకన్న,ప్రసాద్,రమేష్, భాస్కర్, రాష్ట్ర యువజన అధ్యక్షులు ముక్త కృష్ణ పాల్గొన్నారు.

గోషామహల్‌లో ఆసుపత్రి నిర్మాణం చేపట్టొద్దు



మాట్లాడుతున్న నాయకులు

అఫ్జల్‌గంజ్: గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం చేపట్టవద్దని గోషామహల్ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం అఫ్జల్‌గంజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం వల్ల సామాన్యులకు చాలా సమస్యలు ఎదురవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కోటి శైలేష్ కుమార్, దత్తు, గణేష్, సల్మాన్, కిరణ్ ముదిరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గోరక్ష మహా పాదయాత్రకు ఘన స్వాగతం



బాలకృష్ణ గురుస్వామికి స్వాగతం పలకుతున్న గాజుల అంజయ్య, సదానంద్ యాదవ్

చార్మినార్: కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గోరక్ష మహా పాదయాత్ర నిర్వహిస్తున్న బాలకృష్ణ గురుస్వామి ఆదివారం పాతబస్తీకి చేరుకోగా ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయానికి చేరుకుని అమ్మవారికి జరిగిన మహా హారతి పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీరాలంమండి శ్రీ మహం కాళేశ్వర దేవాలయానికి చేరుకోగా దేవాలయం కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు,స్థానిక ప్రజలు పూలాభిషేకంతో స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా గాజుల అంజయ్య మాట్లాడుతూ..బాలకృష్ణ గురుస్వామి చేస్తున్న మహా యజ్ఞానికి ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బేలా ముత్యాలమ్మ దేవాలయం కమిటీ అధ్యక్షులు పాటేల్ సదానంద్ యాదవ్, భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ఉపాధ్యక్షులు మధుసూదన్ యాదవ్, హరిబౌలి బంగారు మైసమ్మ దేవాలయం కమిటీ మాజీ అధ్యక్షులు అనంతోజ్ హన్స్‌రాజ్, ప్రముఖ బిల్డర్ కోటిరెడ్డి, బీజేపీ నాయ కులు ప్యారసాని వెంకటేష్, శ్రీధర్ యాదవ్, కాట రమేష్ పాల్గొన్నారు.

నయాపూల్ వద్ద..

గౌలిపురా: నయాపూల్ వద్దకు చేరుకున్న బాలకృష్ణ గురుస్వామికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, లాల్‌దర్వాజా సింహవాహిణి శ్రీ మహంకాళి దేవాలయం మాజీ చైర్మన్ కె.వెంకటేష్, మాజీ చైర్మన్ కె.విష్ణుగౌడ్ ఘనంగా స్వాగతం పలికారు. తొమ్మిది రాష్ట్రాలు, 87 రోజులు, 2600 కిలో మీటర్లకు పైగా గోమాతతో నడుచుకుంటూ హైదరాబాద్‌కు చేరుకోవడం గొప్ప విషయమన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని జాఫర్ రోడ్డు బడాబజార్, గంగానగర్ నాలా, షాఖత్‌జంగ్ దేవిడి, మాతాకీ కిడికి తదితర ప్రాంతాల్లో ఆదివారం ఆయన కార్పొరేటర్లతో కలిసి పర్యటించగా వివిధ సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టి సమస్యలు లేకుండా చేస్తానన్నారు. నూతన కమ్యూనిటీ హాళ్లు, క్రీడా మైదానాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో రోడ్డు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ పనులు చేపట్టామన్నారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, అలాందార్ వాలాజాహి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

అర్హులే సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అర్హులైన నిరుపేద కుటుంబాల వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఉదయం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ... దరఖాస్తు చేసుకునే వారు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ దరఖాస్తులో నిర్దేశించిన పత్రాలన్ని మీసేవాలో దరఖాస్తు చేసుకోవలన్నారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి, వైద్య చికిత్సల కోసం దరఖాస్తులు చేసుకునే వారు సరైన ధ్రువపత్రాలు జత చేయాలన్నారు. వైద్య చికిత్సల కోసం సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకునే వారు డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌తో పాటు దవాఖానాకు సంబంధించిన బిల్లులు కూడా జత చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పూజలు



అయ్యప్ప స్వామి పూజల్లో భక్తులు



పూజలో పాల్గొన్న ఆలె జితేంద్ర

చార్మినార్: అయ్యప్ప నామస్మరణంతో ఆదివారం మీరాలంమండి మార్మోగింది. పాతబస్తీలోని అన్ని ప్రాంతాలకు చెందిన అయ్యప్ప భక్తులు మీరాలం మండిలో జరిగిన అయ్యప్ప స్వామి పూజకు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తగు సౌకర్యాలు కల్పించారు. పూజల అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గాజుల అంజయ్య, బాలకృష్ణ గురుస్వామి పాల్గొన్నారు.

ఛత్రినాక ప్రాంతంలో..

గౌలిపురా: గౌలిపురా డివిజన్ ఛత్రినాక ప్రాంతంలో ఆదివారం కన్యస్వామి ప్రేమ్‌కిశోర్ ఆధ్వర్యంలో ఆదిఆరం నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజలో మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.సోమ్‌రాజ్, కె.రాజ్ కుమార్, రవి గురుస్వామి, సుమన్ కుమార్ ముదిరాజ్, కె.రవికుమార్, ఎం.ఉదయ్ కిరణ్ రెడ్డి, జమాల్‌పూర్ అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించేలా కృషి చేయాలి



వార్షికోత్సవంలో పాల్గొన్న టికే.శ్రీదేవి, బ్రదర్ షజాన్ ఆంటోనీ

అబిడ్స్: విద్యార్థులు చదువుతో పాటు తాము ఎంచుకున్న లక్ష్యాలు ఛేదించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ టీకే. శ్రీదేవి పేర్కొన్నారు. అబిడ్స్‌లోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన వార్షికోత్సవంలో కాంటినెంటల్ ఆసుపత్రి చైర్మన్ ఎండీ డాక్టర్ గురు ఎస్ రెడ్డి, డాక్టర్ బి.రేష్మా, ఆనంద్‌కుమార్ సర్దివాల్, పాఠశాల ప్రిన్సిపల్ బ్రదర్స్ షాజాన్ ఆంటోని, వైస్ ప్రిన్సిపల్ బ్రదర్, అపాలియో డిషుజ, బ్రదర్ జగప్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టికే.శ్రీదేవి మాట్లాడుతూ..లిటిల్ ఫ్లవర్ స్కూల్లో, ఇక్కడి ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ సమాజంలో అత్యున్నత హోదా పదవుల్లో రాణించేలా తీర్చిదిద్దడం గొప్ప విషయం అన్నారు. డాక్టర్ గురు ఎస్‌రెడ్డి మాట్లాడుతూ.. లిటిల్ ఫ్లవర్ పాఠశాలకు విద్యారంగంలో ఒక ప్రాముఖ్యత ఉందని, అన్ని ప్రమాణాలతో విద్యను అందించడంలో తమ వంతు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అజిత్‌కుమార్, బ్రిడ్జ్ మోహన్, సంపత్‌కుమార్, శ్రీధర్, బాల్‌రెడ్డి, రమేష్, సునిత, దీప్తి జైస్వాల్ పాల్గొన్నారు.

ఖిలా.. టూరిస్ట్ ఫిదా.!

గోల్కొండ కోటకు పోటెత్తిన పర్యాటకులు



గోల్కొండ: పర్యాటక ప్రాంతమైన చారిత్రక గోల్కొండ కోట పర్యాటకులతో జనసంద్రంగా మారింది. భారీగా తరలివచ్చిన పర్యాటకులు, వారి వాహనాలతో కోటకు వచ్చే రహదారులన్నీ కిటకిటలాడాయి. రాందేవ్‌గూడ రోడ్డు, బంజారా దర్వాజా, గోల్కొండ కోట చౌరస్తా తదితర రోడ్లపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రధానంగా గోల్కొండ కోట చౌరస్తాలో పర్యాటకులతో పాటు వాహనాలు ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయారు. ఇదిలా ఉండగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులతో కోటలోని నగీనాబాగ్, అక్కన్న మాదన్న కార్యాలయం, ఆయుధగారం తదితర ప్రాంతాలన్ని కిటకిటలాడాయి.

ఓల్డ్ సిటీ.. వీకెండ్ రద్దీ.!



చార్మినార్: వీకెండ్ వస్తే చాలు పాతబస్తీలోని పర్యాటక ప్రాంతాలన్నీ సందడిగా కనిపిస్తాయి. మక్కా మసీదు, చార్మినార్,లాడ్‌బజార్,చౌమహల్లా ప్యాలెస్ తదితర పర్యాటక ప్రాంతాలలో సాధారణ రోజుల కన్నా ఆదివారం సందర్శకుల సందడి ఎక్కువైంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు కూడా ఎక్కువయ్యాయి. నయాపూల్ నుంచి గుల్జార్‌హౌజ్ వరకు వాహనాలు స్తంభిస్తాయి. పర్యాటక, వ్యాపార, నివాస పరంగా పాత నగరానికి జనం తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఇక వీకెండ్ అయిన ఆదివారాల్లో చార్మినార్ వైపు వెళ్లే రోడ్డులో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పూర్తి స్థాయిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వాహనదారులు, పర్యాటకులు కోరుతున్నారు. మదీనా–చార్మినార్ ప్రధాన రోడ్డులో ఫుట్‌పాత్‌తో పాటు రోడ్లను సైతం ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. రెగ్యులర్‌గా వ్యాపారాలు చేసే వారిని గుర్తించి వారికి గుర్తింపు కార్డులిచ్చి ఓ స్థలం కేటాయించాలని సందర్శకులు కోరుతున్నారు.